ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 6 జనవరి 2025


గుంటూరులో ప్రథమ బహుమతి పొందిన చౌడం విజయలక్ష్మికి రూ.6వేల నగదు అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి డీజీఎం సూదా రామచంద్రరావు


తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానసకు రూ.6 వేలు అందజేస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కొడాలి వీరయ్య ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి


నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందనకు రూ.6 వేల నగదు అందజేస్తున్న శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ దంపతులు



గుంటూరులో ప్రథమ బహుమతి సాధించిన చౌడం విజయలక్ష్మి వేసిన ముగ్గు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానస వేసిన ముగ్గు


నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందన వేసిన ముగ్గు

ముగ్గులు మురిశాయి

- ఆంధ్రజ్యోతి ముగ్గులతో ఇలపై ఇంద్రధనుస్సు
- రంగవల్లులతో రంగులమయమైన ప్రాంగణాలు
- ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా సందడి
- గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్దసంఖ్యలో హాజరు

రంగు రంగుల రంగవల్లులతో భూమాత పులకరించగా.. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో ఇలపై ఇంద్రధనుస్సు ఆవిష్కృతమైంది. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు జరగ్గా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తీర్చిదిద్దిన ముగ్గులు మురిశాయి. ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా ఆయా ప్రాంగణాల్లో సందడి నెలకొంది. గుంటూరులో పోటీలకు 220 మంది, తెనాలిలో 142 మంది, నరసరావుపేటలో 110 మంది వరకు హాజరై తమ ముగ్గు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ రీతిలో గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు, నవధాన్యాలు, చెరుకుగడలు, పాలపొంగులు, హరిదాసులు, రైతుల బొమ్మలు, పూలతో అలంకరించిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సారి విద్యార్థినులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. ఈ పోటీలతో మనదైన సంస్కృతి, సంప్రదాయాన్ని ఒక తరం నుంచి మరో తరం అందిపుచ్చుకునేలా ఆంధ్రజ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించిందని అతిథులు, హాజరైన వారు అభిప్రాయపడ్డారు.

గుంటూరు(విద్య), తెనాలి అర్బన్, నరసరావుపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గులను తీర్చిదిద్దేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా ముందుకు రావడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన కనిపించింది. గుంటూరు, తెనాలి, నరసరావుపేటల్లో పోటీలు జరగ్గా ఆయా ప్రాంతాల్లో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గుంటూరులో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ అంగలకుదురు, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా స్పాన్సర్లుగా వ్యవహరించారు. పోటీలు గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగినా చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీప జిల్లాలకు చెందిన వారు కూడా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మంచు, చలిగాలులను సైతం లెక్క చేయకుండా పదుల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 9 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా ముగ్గులను తీర్చిదిద్దారు. ముగ్గులను తిలకించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు. సంప్రదాయాలను మేళవిస్తూ.. వినూత్నంగా.. విభిన్నంగా.. సందేశాత్మకంగా మహిళలు ముగ్గులను తీర్చిదిద్దడంతో విజేతల ఎంపికకు న్యాయనిర్ణేతలు శ్రమపడాల్సి వచ్చింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదుతో పాటు కన్సోలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రత్యేక గిఫ్టులను గుంటూరులో కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అనురాధగుప్తాలు అందజేశారు. గుంటూరులో ఒకవైపు మహిళలు ముగ్గులు తీర్చిదిద్దుతూ తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు పోటీపడగా వారి పిల్లలు, మరికొందరు మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

మహిళా నైపుణ్యాలకు ముగ్గులు దర్పణం : కుర్రా అప్పారావు

గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు మాట్లాడుతూ మహిళల్లోని నైపుణ్యాలకు ముగ్గులు దర్పణంగా నిలిచాయని ప్రశంసించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రోత్సహించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ముగ్గులతో ఆరోగ్యం : వీరవల్లి మురళి

తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పోటీ ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. పోటాపోటీగా మహిళలు ముగ్గులు తీర్చిదిద్దడంతో నగదు బహుమతులతో పాటు ప్రత్యేకంగా పట్టుచీరలు అందజేశారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మొదటి ముగ్గురితో పాటు

(మిగతా 7వ పేజీలో)

విజేతలు

గుంటూరు
1. సీహెచ్ విజయలక్ష్మి
2. పీ.పూజిత
3. కే.చందన

కన్సొలేషన్: సునీత, శ్రీలత, మాధవీలత, గీజాంజలి, మాధవి

తెనాలి
1. కే.మానస
2. ఎస్.లక్ష్మీతిరుపతమ్మ
3. పీ.సాయిచైతన్య

నరసరావుపేట
1. కుమ్మరి చందన
2. ఏ.నాగజ్యోతి
3. పాపన సుజాత

కన్సొలేషన్ : మచ్చా మాధవి, బాపతు లావణ్య, గ్రంధి సురేఖ, మర్రెం లక్ష్మీతిరుపతమ్మ


తెనాలి : బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు


గుంటూరు : ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు


నరసరావుపేట : ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో ముగ్గులను తీర్చిదిద్దుతున్న మహిళలు


టీడీపీ నేతలపై దాడి చేసిన తురకా కిశోర్ అరెస్టు

-వివరాలు మెయిన్‌లో


సంక్రాంతికి గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

7

ఒక్క రోజు తనిఖీలతో రూ.26.32 లక్షలు

వాణిజ్య పన్నులశాఖకు స్వేచ్ఛ ఇస్తే ఇంకెంత ఆదాయమో?

- గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకుంటే నెలకు రూ.కోట్లలో రాబడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఒక్కరోజు తనిఖీలతో రూ.26.32 లక్షల ఆదాయం. మరి ఇదే రోజు వారీగా చేస్తే.. అలా చేసేందుకు అధికారులు స్వేచ్ఛ ఇస్తే ప్రభుత్వ ఆదాయం రూ.కోట్లలో ఉంటుందా అంటే శనివారం నరసరావుపేటలో చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే అవుననంటున్నాయి. పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతుండగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళుతుంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే ప్రతి నెల వందలాది లారీల గ్రానైట్ జిల్లా గుండా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. శనివారం జిల్లాలో విస్తృతంగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గ్రానైట్ అక్రమ రవాణా గుట్టురట్టయింది. ఇతర రాష్ట్రాలను గ్రానైట్ రవాణా చేస్తున్న 14 లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క లారీ నిర్వాహకుడి నుంచి రూ.80 వేలు జరిమానా, అలాగే పన్ను రూపంలో మరో రూ.15.12 లక్షలు, వెరసి రూ 26.32 లక్షలు వసూలు చేశారు. ఈ లారీలు బాపట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ గ్రానైట్ కంపెనీల నుంచి వచ్చినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పన్నులు చెల్లించకుండా మహారాష్ట్రకు తరలిపోతున్నాయని అధికారులు తెలిపారు.

మిన్నకున్న మైనింగ్ శాఖ

వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లారీలను స్వాధీనం చేసుకున్న సమాచారాన్ని మైనింగ్‌శాఖకు తెలిపారు. లారీల్లోని గ్రానైట్‌కు రాయల్టీ చెల్లించారా లేదా అన్న అంశాన్ని మైనింగ్ శాఖ పరిశీలించాలి. లారీల్లో గ్రానైట్ కొలతలు తీసి రాయల్టీ వసూలు చేయాలి. అయితే సదరు అధికారులు ఆదివారం వరకు కూడా చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారు. లారీల్లోని గ్రానైట్ పరిశీలనకే మైనింగ్ శాఖ అధికారులు పరిమితమయ్యారు. కొలతలు తీసి రాయల్టీ వసూలు చేసే ప్రయత్నం చేయకపోవడంతో విమర్శలకు దారితీసింది.

అధికారులపై ఒత్తిళ్లు

వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న లారీలను వదిలేయాలని కొందరు నేతలు అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. జాయింట్ కమిషనర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించిన అధికారులు నేతల ఒత్తిళ్లకు తలొగ్గకుండా జరిమానాలు విధించారు. గ్రానైట్ అక్రమ రవాణాకు సహకరిస్తూ కొందరు నేతలు నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారనే ఆరోపణలున్నాయి.


వాణిజ్య పన్నులశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీలు

రోజూ 60 లారీల్లో గ్రానైట్ అక్రమ రవాణా

పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతోంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే నిత్యం 50 నుంచి 60 లారీల గ్రానైట్ తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిపోతోంది. ఏటా రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్లు సమాచారం. ఇంత పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు కార్యాలయాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు రోడ్డుపైకి వచ్చి తనిఖీలు చేసే స్వేచ్ఛలేదు. ఈ క్రమంలో ప్రభుత్వానికి గ్రానైట్ పన్ను ఆదాయం 90 శాతానికి పైగా తగ్గిందని ఓ అధికారి తెలిపారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కోటప్పకొండ మీదుగా నరసరావుపేట బైపాస్ రోడ్డుకు రాత్రి వేళ గ్రానైట్ లారీలు చేరుకుంటాయి. అక్కడ నుంచి లారీలను రాష్ట్ర సరిహద్దులు దాటించే ముఠా రంగంలోకి దిగి డ్రైవర్లకు టోకెన్లు ఇస్తారు. టోకెన్ ఉన్న లారీని ఎక్కడా ఎవరూ ఆపరని ఎవరైనా ఆపితే తాము చూసుకుంటామని సదరు ముఠా భరోసా ఇస్తుంది. ఏ అధికారైనా టోకెన్ ఉన్న లారీని ఆపితే సదరు ముఠా రంగంలోకి దిగి సురక్షితంగా రాష్ట్ర సరిహద్దు దాటిస్తోంది. గ్రానైట్ అక్రమ రవాణా వైపు కన్నెత్తి చూసే పరిస్థితులు ఇక్కడి అధికారులకు లేదంటే అక్రమ దందాకు ఏ స్థాయిలో నేతల అండదండలు ఉన్నాయో తెలుసు కోవచ్చు. అయితే అకస్మాత్తుగా వాణిజ్య పన్నుల అధికారులు ఎవరూ ఊహించని విధంగా శనివారం పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించి 14 లారీలను సీజ్ చేయడం విశేషం.

నవ్య

కుటుంబ కదంబం



ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్లు అనుభవించారు చెన్నైకి చెందిన భాను సురేష్‌బాబు. కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సెలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం


మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటు వైపు వెళ్లరు.


ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు







17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!

తేనె



● ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేక్‌లు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.

బెల్లం



● దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు



● కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.

ఇలపై ఇంద్రధనస్సు

ఇంద్ర ధనస్సులోని వర్ణాలను ఇలపైకి దించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తెలుగు సంస్కృతిని, సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తూ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో ముగ్గులను తీర్చిదిద్దారు. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. సప్తవర్ణాలతో మహిళలు వేసిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.







తెనాలిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత లక్ష్మీతిరుపతమ్మకు బహుమతి అందజేస్తున్న రాజకుమారి, మురళి, నాగభూషణం తదితరులు



నరసరావుపేటలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు





గుంటూరులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

గుంటూరులో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత పూజిత

గుంటూరులో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత చందనకు బహుమతి అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు తదితరులు



నరసరావుపేటకు చెందిన ఏ నాగజ్యోతికి ద్వితీయ బహుమతిని అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ





నరసరావుపేటలో తృతీయ బహుమతి సాధించిన ముగ్గు







తెనాలిలో మూడవ బహుమతి పొందిన ముగ్గు, విజేత పి.సాయిచైతన్యకు బహుమతి అందజేస్తున్న రాజకుమారి, మురళి, నాగభూషణం తదితరులు



నరసరావుపేటలో తృతీయ బహుమతిని పాపన సుజాతకి అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ

ముగ్గులు.. మురిశాయి


తెనాలి: ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, గణేష్ యూత్ మురళి, న్యాయనిర్ణేతలు


నరసరావుపేట: ముగ్గులను పరిశీలిస్తున్న స్పాన్సరర్స్ శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్తా, అనురాధ


గుంటూరు: ముగ్గులను పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు తదితరులు

(5వ పేజీ తరువాయి)

15 మందికి నాలుగో, 25 మందికి ఐదో, మరో 60 మందికి ప్రోత్సాహక బహుమతలను గణేష్ యూత్ సభ్యులు కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, కె.విష్ణు, గుమ్మడి రవీంద్రలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీరవల్లి మురళి మాట్లాడుతూ సంక్రాంతి సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనసుకు ఆహ్లాదం కూడా కలుగుతుందన్నారు. చిన్నారులు, యువతులు కూడా ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం మంచి పరిణామమన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, సంక్రాంతి సంబరం ముందుగానే వచ్చిన అనుభూతి కలిగిందని, ఓర్పుతో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ముచ్చట గొలిపాయన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు పోటీలను పర్యవేక్షించారు.

ఆంధ్రజ్యోతి ప్రయత్నం అభినందనీయం : సుబ్బరాయగుప్తా

నరసరావుపేలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన ముగ్గుల పోటీలతో ఆ ప్రాంగణంలో సంక్రాంతి సందడి నెలకొంది. బహుతుల ప్రధానోత్సవ సభలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా మాటాడుతూ అపార్టుమెంట్ల సంస్కృతి రావడంతో ఇళ్ల ముందు ముగ్గులేసే సంప్రదాయం నానాటికీ కనుమరుగవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి పత్రిక సామాజిక బాధ్యతతో 15 ఏళ్లుగా ముగ్గుల పోటీ నిర్వహిస్తు, మన సంస్కృతిని కాపాడుతుండటం అభినందనీయమన్నారు. అనురాధాగుప్తా మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు ఎలాగో ఇంటి ముందు ముగ్గు ఇంటికి అందం అన్నారు.


గుంటూరులో ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి భోజనాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు


గుంటూరులో ముగ్గుల పోటీలు సందర్భంగా చిన్నారుల నృత్యం


తెనాలిలో మగ్గుల పోటీలకు వచ్చిన మహిళలు


తెనాలిలో నాలుగో బహుమతి అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి

సంక్రాంతికి గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఆదివారం తెలిపారు. నంబరు. 07037 వికారబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 13వ తేదీన రాత్రి 7.40కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా 14వ తేదీ ఉదయం 8.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07038 కాకినాడటౌన్ - చర్లపల్లి రైలు ఈ నెల 14వ తేదీన రాత్రి 8.30కి బయలుదేరి గుంటూరు మీదుగా 15వ తేదీ ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07035 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో రాత్రి 7.15కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07036 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో రాత్రి 7.15కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07078 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 12, 19 తేదీల్లో ఉదయం 10.05 గంటలకు బయలుదేరి గుంటూరు మీదుగా అదే రోజు రాత్రి 7.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07079 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలు ఈ నెల 12, 19 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నంబరు. 07033 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 7, 9, 13, 15, 17 తేదీల్లో రాత్రి 7.30కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07034 నరసపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 8, 10, 14, 16, 18 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 8, 10, 12, 14 తేదీల్లో రాత్రి 9.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు ఈ నెల 9, 11, 13, 15 తేదీల్లో రాత్రి 8.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 9, 12, 14 తేదీల్లో రాత్రి 7.20కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 10, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07041 కాచీగూడ - శ్రీకాకుళం రోడ్డు ఈ నెల 7వ తేదీన రాత్రి 7.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు, నంబరు. 07042 శ్రీకాకుళం రోడ్డు - కాచీగూడ రైలు ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30కి చర్లపల్లి చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు. నేడు, రేపు రెండు ప్రత్యేక రైళ్లు: సోమ, మంగళవారాల్లో గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. నంబరు. 07077 చర్లపల్లి - తిరుపతి రైలు ఈ నెల 6వ తేదీన(సోమవారం) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదుగా రాత్రి 7.45కి గుంటూరు, ఆ తర్వాత తెనాలి, బాపట్ల, చీరాల మీదుగా ప్రయాణించి మంగళవారం వేకువజామున 4 గంటలకు తిరుపతి చేరుకొంటుంది. నంబరు. 07078 తిరుపతి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 7వ తేదీ మంగళవారం రాత్రి 8 గంటలకు తిరుపతిలో బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.30కి గుంటూరుకి వచ్చి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా బుధవారం చర్లపల్లి చేరుకొంటుంది.





మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు




సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద


హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు హామీపై హర్షం

మంగళగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించడంపై మాజీ సైనికుల సంక్షేమ సంఘం హర్షం వెలిబుచ్చింది. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో మాజీ సైనిక సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. మాజీ సైనిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సైనిక సంఘాలు అనేకం ఉన్నాయని, వీటన్నింటినీ ఒకతాటిపైకి తీసుకువచ్చి ఒక రాష్ట్రం, ఒకే మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఉండాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మరో మూడు నెలల్లో సంఘాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానించారు. సమావేశంలో మంగళగిరి వెటరన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, శ్రీకాకుళం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, నేతలు సూరిరెడ్డి శివకుమార్, పి.విశ్వేశ్వరరావు, ఎస్ఎస్ రాముడు, ఎన్.నాగేశ్వరరావు, ఏపీ నాయుడు, అన్నె రామారావు, జి.కోటేశ్వరరావు, అడపా శంకర్, సీహెచ్ వెంకట అప్పారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాజీ సైనిక సంఘాల ప్రతినిధులు

అమ్మవారి దర్శనం ఎంతో పుణ్యఫలం

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్

పిట్టలవానిపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకోవటం ఎంతో పుణ్య ఫలమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ అన్నారు. మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత బాపట్ల మున్సిఫ్‌కోర్టు మెజిస్ట్రేట్, ఆర్డీవో, రెవెన్యూ, చందోలు పోలీసులు, చందోలు గ్రామ పంచాయతీ సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం సంప్రదాయం ప్రకారం ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సిబ్బందితో కలిసి పూర్ణకుంభంతో ఆలయ ప్రదక్షణ గావించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన జస్టిస్ చల్లా గుణరంజన్ దంపతులకు దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.


ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజాన్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ ఈవో నరసింహమూర్తి

రేపటి నుంచి ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విజయవాడ, కర్నూలు నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. అలానే ఈనెల 10వ తేదీన కర్నూలులో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరయ్యే వారు ముందుగానే తమ పేర్లను ఆన్‌లైన్‌లో ఏపీఈఆర్‌సీలో గానీ, గుంటూరు సంగడిగుంటలోని సర్కిల్ కార్యాలయంలో గానీ, గుంటూరు నల్లచెరువు, తెనాలి (చెంచుపేట) డివిజనల్ కార్యాలయంలోనైనా ముందుగానే నమోదు చేసుకొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ మూడు రోజుల్లో గుంటూరు సర్కిల్ కార్యాలయం, తెనాలి, గుంటూరు నల్లచెరువులోని డివిజనల్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ నీటి మట్టం ఆదివారం నాటికి 568.10 అడుగులుంది. ఇది 251.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, ఔట్‌ఫ్లో వాటర్ 20,308 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

జోన్ డైరీ

● మాచర్ల రూరల్ మండలంలోని అలుగురాజుపల్లిలో గల న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారికోసం మధ్యాహ్నం 11:30 గంటలకు, 12 గంటలకు మాచర్ల పట్టణం నుంచి కళాశాల వరకు ఉచిత బస్సు సర్వీసు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 9494470813, 9494470817లను సంప్రదించాలన్నారు.

● మండల కేంద్రమైన దుర్గిలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 71వ వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం సాయంత్రం కల్లా తమ టీం పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు సెల్: 7732028239, 7285998534 లను సంప్రదించాలన్నారు.

సత్తెనపల్లి పట్టణంలోని వెంకటేశ్వర గ్రాండ్ కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు పట్ట భద్రుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరుకానున్నారని టీడీపీ పట్టణ కార్యదర్శి నూర్ బాషా జానీ బాబు తెలిపారు. పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

వెల్దుర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం మాచర్ల ఎక్సైజ్ అధికారులతో కలిసి మండల కేంద్రమైన వెల్దుర్తిలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కాయితి వెంకటేశ్వరరెడ్డి వద్ద తెలంగాణకు చెందిన 84, ఆంధ్రకు చెందిన 33 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో అధికారులు రేఖారెడ్డి, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

దాచేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం పొందుగల గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పాపారావు ఆదివారం తెలిపారు. పట్టుబడ్డ వ్యక్తుల వద్ద నుంచి రూ. 5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నివాళులు ..

సత్తెనపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : 20 సూత్రాల కమిటీ మాజీ చైర్మన్ సాయి బాబా తల్లి శ్యామలమ్మ దశ దిన కర్మలో ఆదివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు.

సత్తెనపల్లి పట్టణంలోని 8వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త వంకాయలపాటి బ్రహ్మ(60) ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, టీడీపీ పట్టణ నేతలు నివాళులర్పించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు విడుదల

రెంటచింతల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధిహామి పథకం కింద రూ.30 లక్షలు విడుదలైనట్లు పీఆర్ ఏఈ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్లవరం గ్రామంలోని గిరిజన కాలనీలో సీసీ రోడ్డుకు రూ.20 లక్షలు, పశర్లపాడుకు రూ.10 లక్షలు విడుదలయ్యాయన్నారు. రూ.2 కోట్ల 20 లక్షలతో గ్రామాల్లో 22 చోట్ల సీసీ రోడ్లు వేస్తుండగా అందులో 11 పనులు పూర్తయ్యాయని తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

● మరొకరు గల్లంతు

సత్తెనపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు గల్లంతైన సంఘటన పట్టణంలోని అమరావతి బ్రాంచ్ కెనాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన ఐదుగురు బాలురు ఈత కొట్టేందుకు అమరావతి బ్రాంచ్ కెనాల్‌కు వెళ్లారు. అందులో నల్లూరి గోపీచంద్, పొదిలి చరణ్ గల్లంతయ్యారు. పొదిలి చరణ్(14) మృతదేహాన్ని పోలీసులు, తల్లిదండ్రులు వెలికితీశారు. నల్లూరి గోపీచంద్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరితోపాటు ఈతకు వెళ్లిన మరో ముగ్గురు క్షేమంగానే ఉన్నారు. వీరంతా పట్టణంలోని రాఘవేంద్ర బాల కుటీర్‌లో 9వ తరగతి చదువుతున్నారు. గోపీచంద్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గోపీచంద్ (ఫైల్)


చరణ్ (ఫైల్)

ప్రమాదకరంగా ప్రభుత్వ భవనాలు

- కనీస మరమ్మతులకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు
- శిథిల భవనాల్లోనే విధుల నిర్వాహణ
- ఆందోళన వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

క్రోసూరు మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ కనీస మరమ్మతులకు నోచు కోవటం లేదు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనాల్లోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని కార్యాలయాల భవనాలు మరింత పగుళ్లిచ్చి ప్రమాదకరంగా ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో శిథిలావస్థ భవనాల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాల మరమ్మతులపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న సబ్ డివిజన్ కెనాల్స్ డీఈ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

క్రోసూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం క్రోసూరులోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకుచేరి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కెనాల్స్ సబ్ డివిజన్ డీఈ కార్యాలయాన్ని కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. ఈ భవనం శ్లాబు పెచ్చులూడుతోంది. అలాగే వర్షం కురిస్తే నీరు కారుతూ ఉంటోంది. మూడు మండలాలకు చెందిన కెనాల్స్ రికార్డులన్నీ ఈ భవనంలోనే ఉంటాయి. ముఖ్యంగా ఈ కార్యాలయ భవనం కనీస మరమ్మతులకు నోచుకోక చాలా కాలమైంది. గత ఐదేళ్లలో ఏ మాత్రం నిధులు కేటాయించింది లేదు. దీంతో శిథిల భవనంలో విధులు నిర్వహించాలంటే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

కూలిపోవడానికి సిద్ధంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం..

క్రోసూరులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూలి పోవటానికి సిద్ధంగా ఉంది. ఈ కార్యాలయంలోనూ మూడు మండలాలకు చెందిన రికార్డులు భద్రపరిచి ఉన్నాయి. సంవత్సరానికి రూ.11 కోట్ల నుంచి రూ 15 కోట్ల వరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ద్వారా ఆదాయం లభిస్తుంటుంది. కార్యాలయం లోపల, బయటపై కప్పు పెచ్చులూడిపోయి, కొయ్య దూళాలు పుచ్చిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. వర్షం వస్తే కంప్యూటర్లు, ప్రింటర్లపై పట్టలు కప్పుకొని విధులు నిర్వహించాల్సి వస్తోందని ఉద్యోగులు, సిబ్బంది చెపుతున్నారు.



దొడ్లేరులోని బీసీ బాలుర వసతి గృహం

పిచ్చి చెట్ల మధ్యన పోలీసు క్వార్టర్స్..

క్రోసూరులో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన పోలీసు సిబ్బంది క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మొత్తం 20 మంది సిబ్బంది ఉండగా 10 క్వార్టర్స్ మాత్రమే ఉన్నాయి. నిర్మాణం తర్వాత భవనాలకు ఎప్పుడూ కనీస మరమ్మతులు కూడా చేయించలేదని ఆయా కార్టర్స్‌లో నివశించేవారు చెబుతున్నారు. ఆవరణ మొత్తం పిచ్చి చెట్లతో నిండిపోయి విషసర్పాలు సంచరిస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. కిటికీలు విరిగి పోయి మరుగు దొడ్లు వాడకానికి కూడా పనికి రాకుండా ఉన్నాయని, పై కప్పులు కూడా కారుతున్నాయని, మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు. 2000 సంవత్సరంలో ఈ క్వార్టర్స్‌ను నిర్మించారు.

అధ్వానంగా బాలుర వసతి గృహం..

మండలంలోని దొడ్లేరులో బీసీ బాలుర వసతి గృహం భవనంపై కప్పు పెచ్చులు ఊడి పడి పోతున్నాయి. విద్యారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఒకటి నుంచి 10వ తరగతికి చెందిన సుమారు 70 మంది విద్యార్థులు ఈ హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్‌లో బోరింగ్ చెడి పోయిందని, కిటికీ తలుపులు, ద్వారాల తలుపులు విరిగి పోయాయని విద్యార్థులు తెలియ జేశారు. మరుగుదొడ్లు తలుపులు విరిగిపోయి వాడుకోవటానికి ఇబ్బందిగా ఉందని విద్యార్థులంటున్నారు. కిటికీలకు తలుపులు పూర్తిగా విరిగిపోవటంతో తాత్కాలికంగా మెస్ డోర్లు ఏర్పాటు చేసుకున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శిథిల భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. అలాగే కెనాల్స్ డీఈ కార్యాలయాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పాత భవనాలను పూర్తిగా కూల్చి నూతన భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది.

సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● ఎస్టీయూ నేతలకు సంఘ నేతల వినతి

క్రోసూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు టి.శరత్, పోలూరి పిచ్చయ్య, చిలకా సురేష్ కోరారు. రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులను కలిసి సీపీఎస్ రద్దు విషయంలో తాము చేసే ఉద్యమానికి సహకరించాలని, తమతో కలిసి నడవాలని విజ్ఞప్తులు చేస్తున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా ఎస్టీయూ రాష్ట్ర నాయకులను ఆదివారం కలిసి విజ్ఞాపన సమర్పించామన్నారు. కొత్త ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని, సీపీఎస్ ఉద్యోగులతో చర్చించి ఆమోద యోగ్యమైన పరిష్కారం చూపిస్తామన్న హామీని నెరవేర్చాలని వారు కోరారు. అన్ని యూనియన్‌ల రాష్ట్ర నాయకులను కలుస్తున్నట్టు వారు తెలిపారు.


ఎస్టీయూ రాష్ట్ర నాయకులకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలి

● టీడీపీ జిల్లా బీసీ సెల్ నేత నాగేశ్వరరావు

కారంపూడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిప్పిస్తానంటూ మోసాలకు పాల్పడిన శ్రీకాంత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా బీసీ సెల్ అఫిషియల్ స్పోక్ పర్సన్ గోరంట్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కారంపూడిలో ఆయన మాట్లాడుతూ శ్రీకాంత్ గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారని, టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. ఏ పార్టీ అధికారంలోకి ఆ పార్టీలోకి వస్తూ శ్రీకాంత్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మాచర్లటౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల శ్రీకోదండ రామాలయంలో ఆదివారం రజక సంఘం పట్టణ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా భీమవరపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దేవనపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మొగిలి వెంకట శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా ఎద్దుల శ్రీనివాసరావు, కోశాధికారిగా తుపాకుల మల్లికార్జునరావు, గౌరవ సలహాదారునిగా భీమవరపు లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులుగా కందారపు లక్ష్మయ్య, ముదిన తిరుపతిరావు, స్వర్ణ వెంకయ్య, బాగం హనుమంతురావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రజక సంఘ నేతలు ఆవులమంద రామస్వామి, పగడాల వెంకటేశ్వర్లు, దేవనపల్లి శ్రీను, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పరిశీలన

పిడుగురాళ్ల,జనవరి5(ఆంధ్రజ్యోతి): వైద్యుడి నుంచి ధ్రువీకరణ పత్రంపొంది పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను ప్రభుత్వ వైద్య బృందం సోమవారం నుంచి ప్రత్యక్షంగా పరీక్షించనుందని ఎంపీడీవో సీహెచ్ రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటపలో పేర్కొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యాధికారులు, మండల పరిషత్ అధికారుల బృందం పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి వారి సర్టిఫికెట్‌లను, పింఛన్‌దారులను పరిశీలించనున్నారని, ఈ మేరకు నెలకు రూ.10 వేలు పైబడి పింఛన్ పొందుతున్న వారు సోమవారం వారి ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండేలా చూడాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నోటీసులు అందజేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి): వైకల్యం లేకుండా నగదు సమర్పించి సదరన్ సర్టిఫికెట్లు సంపాదించి దివ్యాంగ పెన్షన్‌లు పొందుతున్న వారిపై సోమవారం నుంచి విచారణ ప్రారంభమవుతుందని జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్ తెలిపారు. జిల్లాలో పెన్షన్‌ల తనిఖీకి 8 బృందాలను కలెక్టర్ అరుణ్‌బాబు సారధ్యంలో ఏర్పాటు చేశారన్నారు. రూ.15వేలు పైబడి పింఛన్ తీసుకుంటున్న 1035మంది గృహాలకు వైద్య, ప్రత్యేక బృందాలువెళ్ళి తనిఖీ చేస్తాయాన్నారు. ఈ విషయమై ఇప్పటికే పింఛన్‌దారులకు సంబందిత పంచాయతీ, సచివాలయ అధికారులద్వారా నోటీసులు జారీచేశామన్నారు. పింఛన్‌దారులు విచారణకు హాజరుకాకుంటే వారి పింఛన్‌ను హోల్డ్‌లో పెట్టనున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాలో మొత్తం 1035 పింఛన్‌లను తనిఖీ బృందాలు పరిశీలన చేయనున్నట్లు తెలిపారు.


నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

మట్టి రోడ్లకు మోక్షం

● నూతన సీసీ రోడ్లను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

రెంటచింతల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ రెంటచింతలలోని రెండు ప్రధాన చర్చీల నడుమ ఉన్న మట్టిరోడ్డుకు 40 సంవత్సరాల తరువాత ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.15 లక్షల ఉపాధి హామి నిధులతో 200 మీటర్ల పొడవు, 3.7 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డును నిర్మించారు. ఈనెల 7న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈ సీసీ రోడ్డును, అలాగే రూ.40 లక్షలతో నిర్మించిన మరో సీసీ రోడ్డును ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సత్తెమ్మతల్లి గుడికి ఆర్టీసీ బస్సు

అచ్చంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోగల అటవీ ప్రాంతంలోని సత్తెమ్మతల్లి గుడి వద్దకు ఆదివారం రెండు ట్రిప్పులు ఆర్టీసీ బస్సును నడిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలతో పాటు ఆర్టీసీ అధికారులు స్వాగతం పలికారు. మాదిపాడు నుంచి ఉదయం 10 గంటలకు , సాయంత్రం 4 గంటలకు సత్తెమ్మ గుడి వద్దకు బస్సును నడిపారు. ప్రతి ఆదివారం రెండు సార్లుగా బస్సును సత్తెమ్మ గుడి వద్దకు నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పాతిమా, సత్తెమ్మ ఆలయ ఈవో కోటేశ్వరరావు, టీడీపీ నేతలు కొలగాని సత్యనారాయణ, సామాజిక కార్యకర్త బాణావత్ వెంకటేశ్వర్లు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు. సత్తెమ్మతల్లి గుడి వద్దకు ఆర్టీసీ బస్సును నడపాలంటూ గత నెల 23న వెంకటేశ్వర్లు ఆర్టీసీబస్సు కావాలంటూ స్పందనలో దరఖాస్తు అందించారు. స్పందించిన అధికారులు సత్తెమ్మ అమ్మవారి గుడికి బస్సును ఏర్పాటు చేశారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

మాచర్ల రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కంభంపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దుర్గెంపూడి చెన్నకేశవరెడ్డి (38) రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాడు. ఆదివారం తన పొలంలో పని చేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు ప్రమాదవశాత్తూ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మాచర్ల రూరల్ ఇన్‌చార్జి ఏఎస్ఐ రఫి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య వసంత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవం

● హాజరుకానున్న బిషప్ భాగ్యయ్య, తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు, గురువులు

● వేలాది సంఖ్యలో పాటిబండ్ల గ్రామానికి తరలి రానున్న క్రైస్తవ భక్తులు


ఆర్‌సీఎం దేవాలయంలో లోపలి ప్రదేశం

పెదకూరపాడు, జనవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిబండ్ల గ్రామంలో సోమవారం ముగ్గురు రాజుల దేవాలయ శత వార్షికోత్సవం జరుగుతుందని విచారణ గురువులు చిన్నాబత్తిని హృదయ కుమార్ తెలిపారు. కాగా ఆదివారం విచారణ గురువులు, సహాయక గురువుల మహోత్సవ సమష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. గుంటూరు బిషప్ రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య ముగ్గురు రాజుల దేవాలయ ఆశీర్వాదం దివ్య సత్ప్రసాదన ఆరాధనను నిర్వహించారు. సోమవారం జరిగే శత వార్షికోత్సవ సమష్టి దివ్య పూజాబలిలో బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్యతో పాటు తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు, గురువులు పాల్గొంటారని ఫాదర్ హృదయరాజు వివరించారు. మధ్యాహ్నం 3 గంటలకు కోలాటం, సాయంత్రం 5 గంటలకు బ్యాండ్ వాయిద్యాలతో కానుకలు, ఒత్తుల సమర్పణ, రాత్రి 9 గంటలకు విద్యుత్ దీపాలు, బాణ సంచాకాల్పులతో తేరు ఊరేగింపు జరుగుతాయని వివరించారు. 120 అడుగుల ఎత్తైన ఈ ఆలయాన్ని 1925లో నిర్మించగా 2025 నాటికి 100ఏళ్లు పూర్తయిందని వివరించారు. పాటిబండ్ల గ్రామానికి తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది గురువులను, కన్యా స్త్రీలను దైవసేవకు అంకితంచేసిన గ్రామంగా చరిత్ర ఉందన్నారు. 1940లో గుంటూరుపీఠం ఏర్పడిన తర్వాత ఫిరంగిపురం, రెంటచింతల, మూడవ విచారణగా పాటిబండ్ల ఖ్యాతిచెందిందని తెలిపారు. ఇప్పటికే దేశ విదేశాల్లో ఉన్న పలువురు విచారణ గురువులు, కన్యాస్త్రీలు పాటిబండ్ల గ్రామానికి చేరుకున్నారు. శత వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని సుమారు రూ.2 కోట్లతో ఆధునికీకరణచేశారు. క్రీస్తు జీవితంలోని ప్రధాన ఘట్టాలను తెలియజేస్తూ రూపొందించిన ప్రతిమలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

ఏకాభిప్రాయంతోనే పదవులకు ఎంపిక

● మండల టీడీపీ నేతలతో ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏకాభిప్రాయంతోనే నామినేటెడ్ పదవులకు అభ్యర్థులను ఎంపిక చేద్దామని, ఇందులో పార్టీ నేతల నిర్ణయమే ఫైనల్ అని, పార్టీ కోసం కష్టపడ్డోళ్లను అందలమెక్కిద్దామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలో పలు గ్రామాలకు చెందిన నేతలు వెల్దుర్తిలో ఎమ్మెల్యేను కలిశారు. మండలంలో మూడు సొసైటీ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ల ఎంపికకు సంబంధించి సుదీర్ఘంగా చర్చించడంతో పాటు నేతల అభిప్రాయాలను సేకరించారు. అలాగే రెంటచింతల దుర్గి మార్కెట్ యార్డు పరిధిలో ఉందని చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌కు కేటాయించారని గుర్తుచేయగా, ఐదేళ్లుగా అణచివేతకు అక్రమ కేసులకు బాధితులైన నేతలను ఆ పదవిలో కూర్చోబెడదామన్నారు. జీడీసీఎంఎస్, జిల్లా కో ఆపరేటివ్ డైరెక్టర్ల పదవులు గురించి మాట్లాడుతూ సీనియర్ నేతలు, కార్యకర్తల అభిప్రాయమే తుది నిర్ణయమని ఎమ్మెల్యే జూలకంటి స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఎం శౌరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ నాగమ్మ నర్శిరెడ్డి, ప్రభురాజు యాదవ్, కోటేశ్వరరావు, నీలం మల్లయ్య, సిద్దయ్య, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెల్లంకొండ గ్రామం నుంచి హైందవ శంఖారావానికి బయలు దేరిన యువత

హైందవ శంఖారావానికి తరలిన ప్రజలు

క్రోసూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం పేరుతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ సమీపంలోని కేసరపల్లి వద్ద జరిగిన బహిరంగ సభకు మండలం నుంచి కర్నాటి కృష్ణారావు, తిప్పిరెడ్డి జయనేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు బస్సుల్లో కార్యకర్తలు తరలివెళ్లారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావానికి మాచవరం మండలం నుంచి ఆర్యవైశ్య నాయకులు వివిధ వాహనాల్లో భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మాచవరం ఆర్యవైశ్య సంఘ నాయకులు చిట్టిప్రోలు నరసింహారావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘ యువకులు భారీగా తరలి వెళ్లారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం సభకు స్థానిక విశ్వహిందూ పరిషత్ సభ్యులు తరలివెళ్లారు. వీరితోపాటు మండల పరిధిలోని భక్తులు, భజన మండలి సభ్యులు, దేవాలయ పరిరక్షణ సభ్యులు పలు వాహనాల్లో తరలివెళ్లారు. విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు చిట్టిప్రోలు నరసింహారావు, బీజేపీ రాష్ట్ర నేత శెట్టి హనుమంతురావు తదితరులు ఉన్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి): శంఖారావం భారీ బహిరంగ సభకు పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామ యువత తరలి వెళ్లారు. తూమాటి కేశవాచార్యులు, కేశబోయిన వెంకటేశ్వరరావు, తమటం సాంబశివరావు, కవ్వాల శ్రీను, జడ సైదా బాబు, గాదం శివరామ్, దుర్గారావు, మేకల శివయ్య, వీర్ల వెంకయ్య, యాసం సాయి, తిరుమల వెంకటరావు పాల్గొన్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం బహిరంగ సభకు మండల కేంద్రమైన అమరావతి నుంచి వెళ్తున్న వారి బస్సులను విశ్రాంత అధ్యాపకులు వావిలాల సుబ్బారావు జండా ఊపి ప్రారంభించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు

దాచేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడుజిల్లా స్థాయిలో పదో తరగతిలో విద్యార్థులకు దాచేపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షలకు పల్నాడు జిల్లాలోని 40 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. టాలెంట్ టెస్టులో పిడుగురాళ్ల జడ్పీ హైస్కూలుకి చెందిన విద్యార్థి యేలూరు పూర్ణ వెంకట శ్రీనివాసరావు మొదటిస్థానంలో నిలిచిన రూ. 10 వేలు, అచ్చంపేట జడ్పీహైస్కూలు విద్యార్థి చలువాది సందీప్ రెండవ స్థానంలో నిలిచి రూ.5వేలు, ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌కు చెందిన అంగడి పావని చంద్రిక, బ్రాహ్మణపల్లి జీ హైస్కూల్‌కు చెందిన పల్లపోలు హర్షవర్ధన్‌రెడ్డిలు సంయుక్తంగా మూడవ స్థానంలో నిలిచి ఒక్కొక్కరూ రూ.1500 నగదు బహుమతి పొందారు. వీరి తరువాత స్థానాలు సాధించిన 12 మందికి కన్సోలేషన్‌గా రూ.1000 నగదు అందజేశారు. కార్యక్రమానికి అనసూయ మాతా సేవా సమితి, వికాస్ జూనియర్ కళాశాల, నోబుల్ సాయి జూనియర్ కళాశాల, నరసరావుపేటకు చెందిన భవిష్య జూనియర్ కళాశాల యాజమాన్యాలు ఆర్థిక సహకారం అందజేశాయి. దాచేపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరావు, వెంకట రత్నం, ఉపాధ్యాయులు సహకరించారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన శ్రీకాంత్ అరెస్టు

కారంపూడి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద డబ్బులు తీసుకొని మోసగించిన కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన చిరుమామిళ్ల శ్రీకాంత్‌ను గుంటూరు నేరవిభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తనకు ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు తెలుసని, వారి వద్ద పీఏగా పని చేశానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని మాచర్ల నియోజకవర్గంలోని చాలామంది వద్ద లక్షల రూపాయల డబ్బులు వసూలు చేసిన శ్రీకాంత్‌పై కారంపూడి పోలీస్‌స్టేషన్‌తోపాటు పలు స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయి. బాధితులు ఇటీవల గుంటూరులో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శ్రీకాంత్‌ను గుంటూరు నేరవిభాగం పోలీసులు అరెస్టు చేశారు. కాగా శ్రీకాంత్ నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడనే సమాచారంతో శనివారం కారంపూడికి చెందిన పలువురు టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని శ్రీకాంత్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అయితే శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్లో లేడని తెలుసుకొని వెనుదిరిగారు. అయితే పోలీసులు తాము పిలిచినప్పుడు పోలీస్‌స్టేషన్‌కు రావాలని శ్రీకాంత్‌కు నోటీసులు ఇచ్చి పంపినట్లు సమాచారం. కాగా మొన్నటి దాకా వైసీపీలో కొనసాగిన శ్రీకాంత్ గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ పంచన చేరారు.

క్రైమ్ జోన్

వాగులో పడి గేదెల కాపరి మృతి

సత్తెనపల్లి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : వాగులో దిగిన గేదెను బయటకు తోలేందుకు వాగు వద్దకు వెళ్లి ప్రమాద వశాత్తూ కాలు జారటంతో వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పాకాలపాడులో ఆదివారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పలకలూరి గురవయ్య(55) గేదెలు మేపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రోజూ లాగే గేదెలను పొలం తోలుకొని వెళ్ళి ఇంటికి తీసుకు వచ్చే క్రమంలో ఒక గేదె వాగులోకి దిగింది. దాన్ని బయటకు తోలేందుకు వాగు వద్దకు వెళ్ళి ఒడ్డు జారటంతో వాగులో పడ్డాడు. ఈత రాకపోవటం, గురవయ్య నీటిలో మునిగిపోయాడు. విషయాన్ని గమనించిన తోటి వారు గురవయ్యను బయటకు తీసి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు చేరవేశారు. కుటుంబ సభ్యులు ఆయను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతుని భార్య వెంకాయమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తాపీమేస్త్రి మోహన్‌రావు మృతి

దాచేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలో 40 ఏళ్లుగా తాపీమేస్త్రిగా పనిచేస్తూ భవననిర్మాణ కార్మికుల సమస్యపై రాజీలేని పోరాటం చేసిన కొరె మోహన్‌రావు (75) శనివారం రాత్రి మృతి చెందారు. మృతుడు మోహన్‌రావు పల్నాడు ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారు. మృతి విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మోహన్‌రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మండలంలోని తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శారదాంబ జ్యూయలర్స్ నిర్వహించిన ముగ్గుల పోటీలో కన్సోలేషన్ బహుమతిని మద్దూ మాధవికి అందజేస్తున్న కే సుజాత



కన్సోలేషన్ బహుమతిని గ్రంధి సురేఖకు అందజేస్తున్న న్యాయ నిర్ణేత టీ విజయలక్ష్మి



కన్సోలేషన్ బహుమతిని బాపతు లావణ్యకు అందజేస్తున్న న్యాయ నిర్ణేత కే భవాని



కన్సోలేషన్ బహుమతిని మట్రం లక్ష్మీ తిరుపతమ్మకు అందజేస్తున్న నాగసరపు అనురాధ, సుబ్బరాయ గుప్తా



నరసరావుపేటలో నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శారదాంబ జ్యూయలర్స్ ముగ్గుల పోటీలలో ముగ్గులు వేస్తున్న మహిళలు







బహుమతి పంపిణీ సభలో మాట్లాడుతున్న శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మునిసిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, నాగసరపు అనురాధ, వేదికపై న్యాయ నిర్ణేతలు భవాని, విజయలక్ష్మి

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీతో...

తెలుగు సంప్రదాయానికి పట్టం

● మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయ గుప్తా

నరసరావుపేట కల్చరల్, జనవరి, 5 (ఆంధ్రజ్యోతి). ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ మన తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు పట్టం కడుతున్న ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలని మున్సిపల్ మాజీ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా అన్నారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి ముఖ్యఅతిథిగా హాజరైన అనంతరం ఏర్పాటుచేసిన సభలో సుబ్బరాయగుప్తా మాట్లాడారు. పెరిగిపోతున్న పట్టణీకరణలో భాగంగా అపార్టుమెంట్ల సంస్కృతి వచ్చాక ఇంటి ముందు ముగ్గులేసే సంప్రదాయం కనుమరుగైందన్నారు. తమ చిన్నతనంలో సంక్రాంతి పండుగ వస్తుందంటే మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి పోటీలు పడేవారన్నారు. ఆంధ్రజ్యోతి పత్రిక యాజమాన్యం సామాజిక బాధ్యతతో ప్రతియేటా ముగ్గుల పోటీ నిర్వహిస్తూ, మన సంస్కృతిని బతికించడం హర్షించదగిందన్నారు. 15 సంవత్సరాలుగా ఈ పోటీలను నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతిని ప్రశంసించారు. ఇదే సభలో మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనురాధాగుప్తా మాట్లాడుతూ ముగ్గులు మన తెలుగు వారి సంస్కృతికి చిహ్నం అన్నారు. న్యాయ నిర్ణేత కె.భవాని మాట్లాడుతూ ఇంకా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మరో న్యాయనిర్ణేత విజయలక్ష్మి మాట్లాడుతూ మన సంప్రదాయాలలో నిక్షిప్తమైన దేవుని సేవ గురించి వివరించారు. ఈ పోటీలను నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి పత్రికా యాజమాన్యానికి వక్తలందరూ ధన్యవాదాలు తెలిపారు. సభలో కొత్తమాసు సుజాత తదితరులు పాల్గొన్నారు.



వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్న హిమహర్షవర్ధని, జాహ్నవి

మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది

● కుమ్మరి చందన, సాతులూరు



మాది సాతులూరు, ఆంధ్రజ్యోతి వారు నిర్వహించే ముగ్గుల పోటీలు నరసరావుపేటలో పాల్గొనడం ఇదే ప్రథమం. మొదటిసారే బహుమతి అందుకోవడం, అది ప్రథమ బహుమతి కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ పోటీలతో మా ఇంటికి ఆనందాల సంక్రాంతి ముందే వచ్చినట్లయింది. ఇంతకు ముందు గుంటూరులో పాల్గొన్నాను. అప్పుడు బహుమతి వచ్చింది. ముగ్గులంటే తెలుగు వారి సంస్కృతి. అలాంటి సంస్కృతి కనుమరుగవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి ఈ పోటీలు నిర్వహించి, మహిళల్ని ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేయడం గొప్ప విషయం.

మహిళలకు ప్రోత్సాహం అభినందనీయం

● పాపన సుజాత, (తృతీయ బహుమతి), మాదల



మన సంస్కృతిని కాపాడుతూ, మహిళలను ప్రోత్సహిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి ధన్యవాదాలు. మాది ముప్పాళ్ల మండలం మాదల. నేను క్రమం తప్పకుండా ఆంధ్రజ్యోతి నిర్వహించే ముగ్గుల పోటీలలో పాల్గొంటున్నాను. గత యేడాది పోటీలో ప్రథమ, ఈసారి తృతీయ బహుమతి వచ్చింది.

సంప్రదాయాలకు విలువనివ్వటం హర్షణీయం

● ఎ.నాగజ్యోతి (ద్వితీయ బహుమతి), నరసరావుపేట



15 సంవత్సరాలుగా సామాజిక దృక్పథంతో సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిస్తూ ఆంధ్రజ్యోతి చేపట్టిన ఈ యజ్ఞం హర్షణీయం. నేను గత పది సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న పోటీలలో పాల్గొంటున్నాను. పాల్గొన్న ప్రతిసారీ బహుమతి పొందాను. ఇప్పటికి ఆరుసార్లు ప్రథమ, మిగతాసార్లు ద్వితీయ, తృతీయ బహుమతులు పొందాను.

వైకల్యాన్ని జయించి...



నరసరావుపేట కల్చరల్, జనవరి, 5 (ఆంధ్రజ్యోతి): కనమర్లపూడి శ్రీ పార్వతి, వయసు 62 సంవత్సరాలు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొంది. ఆమెకు పుట్టుకతోనే కుడి చేతికి వైకల్యం ఉంది. చేతి వేళ్లు లేవు. అయినా సంకల్పంతో వైకల్యాన్ని జయించి ముగ్గుల పోటీలో పాల్గొంది. ఆమె ఉత్సాహాన్ని గమనించిన నాగసరపు సుబ్బరాయ గుప్తా సతీమణి అనురాధగుప్తా ఆమెకు రూ.500 నగదు బహుమతి అందజేశారు.

ఇది తమిళ అమ్మాయి ముగ్గు



నరసరావుపేట కల్చరల్: ముగ్గుల పోటీలలో పాల్గొని ముగ్గు వేస్తున్న ఈ అమ్మాయి పేరు తిరునల్వేలి బాల సాయి కుమారి. వీరిది తమిళనాడులోని చెన్నై. ఉద్యోగరీత్యా నరసరావుపేటలో స్థిరపడ్డారు. ముగ్గుల పోటీ గురించి తెలుసుకుని శనివారం తన తల్లి, తోబుట్టువుతో ఎస్ఎస్ఎన్ కళాశాలకు వచ్చి పోటీలో పాల్గొంది. ముగ్గుల పోటీలో పాల్గొనడం ఇదే మొదటిసారని, పోటీలు నిర్వహించిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు కే భవానీ, టీ విజయలక్ష్మి



నరసరావుపేటలో నిర్వహించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శారదాంబ జ్యూయలర్స్ ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

బస్సు బోల్తా: పదిమంది గాయాలు

చిలకలూరిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట మార్గంలో కోటప్పకొండకు సమీపంలో ఆదివారం రాత్రి ఒక బస్సు బోల్తాపడిన సంఘటనలో పదిమంది గాయపడ్డారు. విజయవాడ గన్నవరంలో జరిగిన హైందవ శంఖారావానికి వెళ్లి మొత్తం 35మంది బస్సులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతంలోని తర్లుపాడు ప్రాంతానికి చెందినవారు ఈ బస్సులో ఉన్నట్లు సమాచారం. బస్‌లో స్టీరింగ్‌కు సమస్య ఏర్పడి బస్సు అదుపుతప్పి ప్రమాదానికి గురయిందని అంటున్నారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో, 108 వాహనాలలో నరసరావుపేట, చిలకలూరిపేట ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

నేడు ప్రజాదర్బార్

బొల్లాపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమం జరగ నున్నట్టు ఎంపీడీవో పీ సీతారామయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరవుతారని, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సమస్యలను పరిష్కరించుకొనేందుకు కార్యక్రమంలో పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్లస్ టూ పాఠశాలల రద్దు ఆలోచన విరమించుకోవాలి

● ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

నరసరావుపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ పాఠశాలల రద్దు ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న పల్నాడు జిల్లాలో విద్యాపరంగా అభివృద్ధిలోకి తీసుకొని రావాల్సి ఉందన్నారు. అలాకాక రాష్ట్ర ప్రభుత్వం ప్లస్ టూ పాఠశాలలను రద్దు చేసేలా నిర్ణయం తీసుకుంటే విద్యాపరంగా జిల్లా ఇంకా వెనక్కు వెళుతుందన్నారు. ఏపీఐ ఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసప్ సుధీర్ బాబు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి మెరుగైన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని అన్నారు. పీఆర్సీ వచ్చేలోగా మధ్యంతర భృతిని 35 శాతం ప్రకటించి ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కే కోటేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్వీ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు చంద్రజిత్‌యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఏ ఏమండి, వీ అక్కయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాదు, కాసా రాంబాబు, ఎస్ఎం సుబాని, గంగాధర్‌బాబు, వెంకట కోటయ్య, భీష్మారావు, ఆంజనేయులు, ఆదాం మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పూడిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామానికి అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం చెప్పారు. ఆదివారం ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో రూ.35.23 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ బొప్పూడిలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగు నీరు అందించే పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, వాటర్‌గ్రిడ్ పథకంలో భాగంగా రాష్ట్రానికి కేంద్రం రూ.1200 కోట్లు మంజూరు చేసినట్టు ఎంపీ తెలిపారు. సాగర్ కాల్వ నుంచి నీరు నేరుగా బొప్పూడి గ్రామంలోని వాటర్ హెడ్ ట్యాంక్‌కు వచ్చేలా ఏర్పాటుచేస్తామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై కూడా దృష్టి పెడతామని ఎంపీ చెప్పారు. పుల్లారావు మాట్లాడుతూ బొప్పూడి కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామి గుడిని అభివృద్ధి చేస్తామని, అవసరమైతే టీటీడీని సంప్రదించి నిధులు సమకూరుస్తామని చెప్పారు. అమృతధార, జల్ జీవన్ మిషన్ పథకాల్లో భాగంగా బొప్పూడిలో ప్రతిఇంటికీ స్వచ్ఛమైన తాగు నీరు అందించే ప్రాజెక్టును కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల రూపురేఖలు మార్చివేస్తామని అన్నారు. బైపాస్ రహదారి అందుబాటులోకి తీసుకొచ్చామని, గ్రామాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ముందుకుసాగాలని కోరారు.

హైందవ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



భక్తులకు ఆహారం నీరు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు తరలివెళ్లే వారి కోసం విజయవాడలోని జాతీయ రహదారిపై ఖాజ టోల్ ప్లాజా వద్ద ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట సొసైటీ, మహదేవ హిందూ పరిరక్షణ సమితి, యోగా విద్య ప్రాణశక్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార పంపిణీ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని భక్తులకు తేనీరు, బిస్కెట్లు, మజ్జిగ, పులిహోర, తాగునీటిని పంపిణీ చేశారు. విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం సభకు వినుకొండ నుంచి వివిధ వాహనాల్లో ఆది వారం తెల్లవారుజామున తరలివెళ్లారు. రాయలసీమలోని నాలుగు జిల్లాల నుంచి వినుకొండ మీదుగా హైందవ శంఖారావానికి వెళ్తున్న భక్తులకు మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోగల శాంతి ఆశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, రాత్రి భోజన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. సుమారు 20వేల మందికి హిమాలయ గురూజీ నేతృత్వంలో ఏర్పాటుచేసిన అన్నదాన సేవలను అందించేందుకు వలంటీర్లు పెద్దసంఖ్యలో పాల్గొని భోజన ఏర్పాట్లు చేశారు.



బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రత్తిపాటి

● యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలో వద్ద ఆదివారం విజయవాడలో జరుగుతున్న హైందవ శంఖారావం సభకు తరలి వెళుతున్న బస్సులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు.

● బొల్లాపల్లి: మండలంలోని హైందవ శంఖారావానికి బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, బొల్లాపల్లి, రేమిడిచర్ల తదితర గ్రామాల నుంచి తరలివెళ్లారు.

బకాయిలు విడుదల చేయాలి

● ఎస్టీయూ(డీ) రాష్ట్ర సలహాదారుడు థామసయ్య

నరసరావుపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రావాలిసిన డీఏ, ఇయల్, ఏపీజీఎల్ఐ టాంటి బకాయిలు విడుదల చేయాలని ఎస్టీయూ(డీ) రాష్ట్ర సలహాదారుడు బీ థామసయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేటలోని చదలవాడ కృష్ణయ్య ఉపాధ్యాయ భవన్ ఎస్టీయూ(డీ) జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీ థామసయ్య మాట్లాడుతూ పేరుకుపోయిన బకాయిలతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిసారి గుర్తింపు పొందిన సంఘాలతోనే చర్చలు జరుపుతోందని, అలాకాకుండా అన్ని సంఘాలకు చర్చలలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సంఘం నూతనం క్యాలండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయు(డీ) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఏ వెంకటేశ్వర్లు, ఎం సాంబశివరావు, ఆనందరావు, కోటేశ్వరరావు, కుంబా సాంబశివరావు, కాలేషావలి, ఎస్‌కే ఖాసీమ్ సాహెబ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్‌లకు డీవైఈవో, డైట్ అధ్యాపకులుగా పదోన్నతి కల్పించాలి

● పల్నాడు జిల్లా హెచ్‌ఎం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సుభాని

నరసరావుపేట టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయితీరాజ్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న సీనియర్ ప్రధానోపాధ్యాయులకు డిప్యూటీ డీఈవోలుగా, డైట్ అధ్యాపకులుగా పదోన్నతి కల్పించాలని పల్నాడు జిల్లా హెచ్‌ఎం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బీఎం సుభాని డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేటలో మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పల్నాడు జిల్లా అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీఎం సుభాని మాట్లాడుతూ సీనియర్‌లకు ఎంఈవో పోస్టులు కూడా ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్లస్ టూ పెడుతుంది కాబట్టి పంచాయితీరాజ్ జూనియర్ కాలేజీలుగా మార్చి ప్రిన్సిపాల్స్‌గా అవకాశం ఇవ్వాలన్నారు. హెచ్‌ఎం అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు ఈ నెల 10న నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలలో జరిగే సర్వసభ్య సమావేశానికి ఉదయం 9 గంటలకు అందరు హాజరుకావాలని కోరారు. బదీలీల సరవణ చట్టం గురించి చర్చించటం జరుతుతుందన్నారు. సమావేశంలో కార్యదర్శి ఆర్ గోవిందరాజులు, వై హనుమంతురావు, ఎండీ రసూల్, బీ మల్లికార్జునరావు, వీ వెంకటరావు, శ్రీనివాసరావు, ఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలను పరిశీలించిన డీసీ, అధికారులు



అధికారులతో కలిసి మేజర్ కాల్వలను పరిశీలిస్తున్న డీసీ కొండలు

వినుకొండ టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెం, దొండపాడు, వెల్లటూరు మేజర్, మైనర్ కాల్వలను డీసీ చైర్మన్ ముత్తినేని ఏడుకొండలతో పాటు ఎన్ఎస్‌పీ డీఈ నారాయణస్వామి, ఏఈలు ముక్తేశ్వరరావు, ఉపేంద్ర, రమేష్, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆయా గ్రామాల రైతులతో కలిసి శనివారం, ఆదివారం కాల్వలను పరిశీలించారు. కాల్వ ఆయకట్టు చివరి భూముల రైతులకు సాగునీరు చేరేలా చర్యలు తీసుకోవాలని డీసీ కొండలు అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పంట కాల్వల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాల్వలపై కనీసం ప్రయాణించే పరిస్థితి కనిపించడం లేదని, కాల్వలకు ఇరువైపులా పిచ్చికంప అల్లుకుపోయిందని, తూటికాడ పూడిక పేరుకుపోవడంతో చివరి భూములకు నీరు చేరే పరిస్థితి లేదన్నారు. చివరి భూములకు నీరు చేరే విధంగా కాల్వలపై మరమ్మతు లు చేపట్టే విధంగా అంచనాలు తయారుచేయాలని ఈ సందర్భంగా సూచించారు.

అంజమ్మ కుటుంబ సభ్యులకు గోనుగుంట్ల పరామర్శ

రొంపిచర్ల, జనవరి 5 (ఆంధ్రజోతి): మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గడిపూడి నరసింహారావు భార్య అంజమ్మ కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. కాగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట వడ్లమూడి వెంకట కిషోర్, మందలపు వెంకటరత్నం, మామిళ్ళపల్లి అప్పారావు, మామిళ్ళపల్లి ఆదిబాబు, పేరుపోగు దాసు తదితరులు ఉన్నారు.



రోటరీ వైద్య క్లినిక్‌కు విరాళం అందచేస్తున్న దాతలు

ఇన్నర్ వీల్ క్లబ్ సేవా కార్యక్రమాలు

చిలకలూరిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రేమలత ఆదివారం స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్‌కు అధికారిక పర్యటనపై వచ్చారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. రోటరీ ఉచిత వైద్య క్లినిక్‌కు రూ.10 వేలు విరాళంగా అందచేశారు. ఇద్దరు పేద మహిళలకు రూ.16 వేల విలువగల రెండు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఒయాసిస్ సంస్థ వృద్ధాశ్రమానికి లక్ష రూపాయలు విరాళంగా అందచేశారు. ముగ్గురు పేద విద్యార్థుల చదువులకు రూ. 20 వేలు ఆర్థికసాయం చేశారు. అసిస్ట్ వృద్ధాశ్రమంకు చెందిన 25 మంది వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నిస్వార్థ సేవా పురస్కార్ అవార్డు పొందిన క్లబ్ ఉపాధ్యక్షురాలు జాష్టి ప్రమీలను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ కార్యదర్శి నార్నె జయలక్ష్మి, గుంటూరు ఇన్నర్ వీల్ పిడిసి వినీత్స్, నిజామాబాద్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు అనిత, డాక్టర్ గట్టు రంగారావు పాల్గొన్నారు.